సంతోష్‌ కుమార్‌కు డాక్టరేట్‌ ప్రదానం


సంతోష్‌ కుమార్‌

పోచారం: చౌదరిగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌ విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్న మేడిశెట్టి సంతోష్‌ కుమార్‌కు వీఐటీ ఏపీ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ లభించింది. 'ఏఐ బేస్డ్‌ సింగిల్‌ అండ్‌ హైబ్రిడ్‌ రిసోర్స్‌ అవార్‌ హెడ్యూలింగ్‌ ఇన్‌ క్లౌడ్‌ ఫాగ్‌ కంప్యూటింగ్‌ ఎన్విరాన్‌మెంట్‌' అనే అంశంపై యూనివర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ కర్రి గణేష్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్‌ సాధించారు. యూనివర్సిటీ స్కోప్‌ డీన్‌ డాక్టర్‌ సుధాకర్‌ ఇలాంగో, రీసెర్చ్‌ డీన్‌ డా. రవీంద్ర ధూళి, ఎక్‌టర్నల్‌ ఎగ్జామినర్‌ (ఎన్‌ఐటీ తిరుచురాపల్లి) డా. సాయికృష్ణ సంయుక్తంగా నిర్వహించిన తుది వైవాను విజయవంతంగా పూర్తి చేసుకుని డాక్టరేట్‌ అందుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్‌ కుమార్‌ను కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ సీవీ కృష్ణారెడ్డి, కంప్యూటర్‌ సైన్‌ విభాగాధిపతి డా. రామేశ్వరయ్య, సహాధ్యాపకులు అభినందించారు.

గురుకుల హైస్కూల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి


ఐటీ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌ యాదగిరియాదవ్‌

ఘట్‌కేసర్‌: దివంగత వ్యాస్‌జీ స్థాపించిన పట్టణంలోని గురుకుల ఎయిడెడ్‌ హైస్కూల్‌, జూనియర్‌ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు మాజీ సర్పంచ్‌ యాదగిరియాదవ్‌ మంగళవారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని జెడ్పీ బాలికలు, బాలుర పాఠశాలను స్థానిక గురుకుల ఎయిడెడ్‌ హైస్కూల్‌లో విలీనం చేయాలని, 26 ఎకరాల స్థలంలో ప్రభుత్వ బాలికలు, బాలుర హైస్కూల్‌ను ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. అలాగే జెడ్పీ పాఠశాలల స్థానంలో విశాలమైన బస్‌స్టాండ్‌గా మార్చాలని కోరారు.

యువకుడి అదృశ్యం


సాయి గణేష్‌

ఘట్‌కేసర్‌: తల్లితో గొడవపడి ఓ యువకుడు ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో అదృశ్యం అయ్యాడు. ఎస్‌ఐ. ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఈడబ్ల్యూఎస్‌ కాలనీకి చెందిన సాయి గణేష్‌ (20) ఈ నెల 4న తల్లితో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినప్పటికీ అతడి ఆచూకి లభించలేదు. దీంతో అతడి తల్లి అంబాజీ మాధవి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ


మూడుచింతలపల్లిలో విచారణ చేస్తున్న పోలీసులు


బాధిత మహిళ బసవమ్మ

శామీర్‌పేట్‌: పొలానికి వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును దుండగులు అపహరించిన ఘటన శామీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌ పరిధి, మూడుచింతలపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండల కేంద్రానికి చెందిన బసవమ్మ రోజూ లాగానే మంగళవారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తోంది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును లాగారు. దీంతో బాధితురాలు ప్రతిఘటించడంతో పుస్తెల తాడులోని కొంత భాగం చేతిలోకి వచ్చింది. కేకలు వేయగా దుండగులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


ప్రేమ్‌కుమార్‌

జవహర్‌నగర్‌: తండ్రి మందలించడంతో మనస్థాపం చెందిన కుమారుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌ బాలాజీనగర్‌లోని వీకే.ఎన్‌క్లేవ్‌ అబ్బెన్స్‌ టవర్‌లో అశోక్‌ కుమార్‌, భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో ఉంటున్నారు. పెద్ద కుమారుడు ప్రేమ్‌ కుమార్‌ (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత కొన్ని రోజులుగా ప్రేమ్‌కుమార్‌ కళాశాలకు వెళ్లడంలేదని తండ్రి మందలించాడు. మనస్థాపం చెందిన ప్రేమ్‌కుమార్‌ ఈ నెల 9న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో కొడుకు ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఫలితం లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో..


షేక్‌ ఫయాజ్‌


జవహర్‌నగర్‌ శాంతినగర్‌ కాలనీలో నివసించే షేక్‌ ఫయాజ్‌ (37) టీ మాస్టార్‌. ఈ నెల 10న షేక్‌ ఫయాజ్‌ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్‌లో నివసించే చిన్నమ్మతో ఫయాజ్‌ గొడవలు ఉన్నాయని, అతని ఆచూకీలో ఆమె ప్రమేయం ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆశ వర్కర్ల పై దాడి అమానుషం

మేడ్చల్‌: తమ న్యాయం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లపై పోలీసులు దాడి చేయడం అమానుష చర్య అని బీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్‌ అన్నారు. మేడ్చల్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్ల పై దాడి చేసి దురుసుగా ప్రవర్తించడను బీఆర్‌టీయు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్మికుల పక్షాన బీఆర్‌టీయు అండగా నిలబడి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

ఈ నెల 15,16 తేదీల్లో గ్రూపు-2 పరీక్షలు

- అభ్యర్థుల కోసం 116 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూపు-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్‌ గౌతమ్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 116 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పేపర్‌-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్‌-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు కమిషన్‌ వెబ్‌సైట్‌ నుంచి హాల్‌ టిక్కెట్లను డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చని కలెక్టర్‌ సూచించారు.

- మొదటి సెషన్‌ అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8:30 గంటల వరకు రావాలని, 9:30 తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించరన్నారు. రెండో సెషన్‌ అభ్యర్థులు మధ్యాహ్నం 1:30 వరకే కేంద్రానికి రావాలని, 2:30 దాటితే ప్రధాన గేట్‌ మూసివేయవేస్తారని ఆయన పేర్కొన్నారు.
- అభ్యర్థులు ఎలాంటి క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్‌ డ్రైవ్‌ లు, బ్లూటూత్‌ పరికరాలు, వాచ్‌, వ్యాలెట్‌, హ్యాండ్‌ బ్యాగ్‌లు, పౌచ్‌లు, రైటింగ్‌ ప్యాడ్లు, నోట్స్‌, చార్ట్‌లు, లూజ్‌ షీట్‌లు, ఆభరణాలు (మంగళసూత్రం, బ్యాంగిల్స్‌- సంబంధిత వస్తువులు మినహా) తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు బూట్లు ధరించకూడదని కలెక్టర్‌ సూచించారు. తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిబంధనల మేరకు హాల్‌ టికెట్‌లో సూచించిన విధంగా పీడబ్ల్యూడీ అభ్యర్థులకు మాత్రమే గంట సమయం అదనంగా ఇవ్వబడుతుందన్నారు. వీరు సదరమ్‌ సర్టిఫికెట్‌/అపెండిక్స్‌ను పరీక్ష రోజున సంబంధిత చీఫ్‌ సూపరింటెండెంట్‌కి అందించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్‌ టికెట్‌పై ముద్రించిన సూచనలు చదివి అనుసరించాలని కలెక్టర్‌ సూచించారు.

'సెయింట్‌ పీటర్స్‌'లో హెల్త్‌ క్యాంప్‌


హెల్త్‌ క్యాంపులో అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో మంగళవారం హెల్త్‌ క్యాంప్‌ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొనగా వారికి వైద్యులు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, డైరెక్టర్‌ సరోజరెడ్డి, ప్రిన్సిపాల్‌ శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌ పోటీలు ప్రారంభం


నాగారంలో.. సీఎం కప్‌ క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: విద్యార్థులు చదువులతోపాటు, క్రీడల్లో రాణించాలని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం సెరినిటీ పాఠశాల ఆవరణలో సీఎం కప్‌ 2024 ఆటలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాల నుంచి ప్రపంచ స్థాయి వరకు క్రీడల్లో విజేతలుగా నిలిచి తెలంగాణ రాష్ట్రానికి నెంబర్‌ వన్‌ క్రీడా రాష్ట్రంగా పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కమిషనర్‌ భాస్కర్‌ రెడ్డి, కౌన్సిలర్లు, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, వివిధ స్కూల్‌పిల్లలు, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో..

సీఎం కప్‌ 2024 మండల స్థాయి క్రీడాపోటీలను మంగళవారం తెలంగాణ రెసిడెన్షియల్‌ స్కూల్‌ ఆండ్‌ కాలేజీ కీసరగుట్ట క్రీడామైదానంలో మండల ప్రజాపరిషత్‌ ప్రత్యేకాధికారి కీర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ప్రిన్సిపాల్‌ తాతారావు, ఎంపీఓ నందకిషోర్‌, ఎస్‌జీఎఫ్‌ తిరుమల్‌రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు, యువతి, యువకులు, స్కూల్‌ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో..

అన్నోజిగూడలోని యాదాద్రి పార్కు వద్ద సీఎం కప్‌ టోర్నమెంట్స్‌ను చైర్మన్‌ కొండల్‌ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టోర్నమెంట్స్‌లో భాగంగా కబడ్డీ, వాలీబాల్‌, కోకో మొదలగు క్రీడల పోటీలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ రవీందర్‌గౌడ్‌, మేనేజర్‌ అంజన్‌రెడ్డి, పీఈటీలు శివరాం, సునీత, నాయకులు బుచ్చిరెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహ, కేఎం రెడ్డి, జితేందర్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.


టోర్నమెంట్స్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

వాల్‌ పోస్టర్‌ విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న కురుమ సంఘం నాయకులు

మేడ్చల్‌: హలో కురుమ చలో కోకాపేట్‌తో కురుమ సంఘం రూపొందించిన కరపత్రాలను, వాల్‌ పోస్టర్‌లను పట్టణ కురుమ సంఘం నాయకులు మేడ్చల్‌లో విడుదల చేశారు. ఈ నెల 14న కోకాపేట్‌లో నిర్మించిన దొడ్డి కొమరయ్య కురుమ ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా కురుమలు సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని కౌన్సిలర్‌ మహేష్‌ కురుమ కోరారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు శ్రీకాంత్‌, ఆంజనేయులు, గణేష్‌, బీరప్ప, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

ఘట్‌కేసర్‌: ఎదులాబాద్‌ గ్రామానికి చెందిన నరేష్‌ ఇటీవల తైక్వాండోలో మాస్టర్‌ డిగ్రీ పట్టా పొందాడు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య, మాజీ సర్పంచ్‌ యాదగిరియాదవ్‌ ఆయనకు అభినందనలు తెలియజేశారు. అనంతరం నరేష్‌ మాట్లాడుతూ.. తైక్వాండోలో గ్రాండ్‌మాస్టర్‌, 30 సార్లు గిన్నిస్‌ బుక్‌ వరల్డ్‌ రికార్డు పొందిన జయంత్‌రెడ్డి దగ్గర శిక్షణ పొందానని, తాను నేర్చుకున్న విద్యను బాలికల ఆత్మరక్షణ కోసం ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఉచితంగా శిక్షణ ఇస్తానన్నారు.

రైతుల శ్రేయస్సుకు పాటు పడతాం


సమావేశంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, పాలకవర్గ సభ్యులు

మేడ్చల్‌రూరల్‌: రైతులకు అన్ని విధాల అండగా నిలిచి వారి శ్రేయస్సుకు పాటు పడతామని మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నర్సింహులు యాదవ్‌ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ కార్యాలయంలో మంగళవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులు పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ.. మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీకి చెందిన ఆస్తులు, వనరులు తమ ఆధీనంలోకి తీసుకుని రైతులకు ఉపయోగకరంగా ఉండేలా వాటిని తీర్చిదిద్ది రైతులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తామన్నారు. పెండింగ్‌ పనులను పూర్తి చేయడంతో పాటు రైతుల అవసరం మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సమావేశంలో వైస్‌ చైర్మన్‌ విఠల్‌ నాయక్‌, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు శంకర్‌ ముదిరాజ్‌, రేగు రాజు, సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను విమర్శించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


సీఐకి వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్‌ సంఘం నేతలు, కౌన్సిలర్లు తదితరులు

కీసర: అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మద్యం మత్తులో ఆర్‌జీకే కాలనీకి చెందిన ఓ వ్యక్తి అంబేడ్కర్‌ గురించి అసభ్య పదజాలంతో విమర్శించాడు. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ.. మంగళవారం కీసర మండల అంబేడ్కర్‌ సంఘం అధ్యక్షుడు కొమ్ముసుదర్శన్‌, ప్రధాన కార్యదర్శి తుడుంశ్రీనివాస్‌, దమ్మాయిగూడ మున్సిపల్‌ కౌన్సిలర్లు సుజాతశ్రీనివాస్‌ తదితరులు సీఐ వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్‌ను విమర్శిస్తూ మాట్లాడిన వ్యక్తి మాటలను వీడియో తీసి వాటాప్స్‌ గ్రూప్‌లో వైరల్‌ చేసిన వ్యక్తులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాశీ నిత్యాన్నదాన సత్రం కోశాధికారిగా శ్రవణ్‌గుప్తా


శ్రవణ్‌కుమార్‌గుప్తాను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

ఘట్‌కేసర్‌: తిరుపతి శ్రీ కాశీ అన్నపూర్ణ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్ట్‌ వృద్ధాశ్రమం కోశాధికారిగా ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు పట్టణానికి చెందిన బచ్చు శ్రవణ్‌కుమార్‌గుప్తా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్యులు ఆయనను మంగళవారం సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ఆర్యవైశ్య యాత్రికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు చంద్రశేఖర్‌గుప్తా, సంఘం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లుగుప్తా, మాజీ ప్రధాన కార్యదర్శి గోపిగుప్తా, ములుగు రాములుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే కేసు


తహసీల్దార్‌ కార్యాలయంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని మేడ్చల్‌ జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌ తహసీల్దార్‌ కార్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ధరణీ దరఖాస్తులు, ల్యాండ్‌, ఆక్విజేషను ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీఓ సైదులు, తహసీల్దార్‌ రజని, నాయబ్‌ తహసీల్దార్‌ రాజేందర్‌, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం


అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ వేడుకలు

ఘట్‌కేసర్‌: శ్రీ సదానందా యోగీశ్వరులు ఆత్మబోధ పీఠం ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీనగర్‌ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి, అమ్మవారి విగ్రహ మూర్తులను నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి కల్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. అనంతరం బ్రాహ్మణుల వేద మంత్రాల మధ్య స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య దంపతులు పాల్గొని అన్నదానం చేశారు. కల్యాణంలో నిర్వాహకులు శ్రీ సదానంద యోగీశ్వరులు సంజీవయ్య, ఆలయ పురోహితులు, నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణంలో భక్తులు

15 లారీల బ్యాటరీలు ఎత్తుకెళ్లిన దుండగులు

కీసర: కీసరలో గుర్తు తెలియని దుండగులు 15 లారీల బ్యాటరీలను ఎత్తు కెళ్లారు. సీ.ఐ వెంకటయ్య, ఎస్‌.ఐ వెంకటేష్‌ వివరాల ప్రకారం.. కీసరలోని బంగారు మైసమ్మ ఆలయం వెనకాల ఉన్న కాలనీల్లో నివసించే డ్రైవర్లు ప్రతి నిత్యం, టిప్పర్‌, ఇసుక లారీలను నిలుపుతారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు వైరింగ్‌ కట్‌ చేసి బ్యాటరీలను తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం డ్రైవర్లు వచ్చి చూస్తే లారీలకు బ్యాటరీలు లేకపోవడం చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దుండగులను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం

మేడ్చల్‌: తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడంతో బీఆర్‌ఎస్‌ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలో, మండలంలోని వివిధ గ్రామాలలో బీఆర్‌ఎస్‌ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలతో అభిషేకం చేశారు. గౌడవెల్లి, రాజబోల్లారం, పూడూర్‌ గ్రామాలలోని తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్‌ఎస్‌ నాయకులు పాలతో అభిషేకం చేశారు. ప్రభుత్వం మారితే తెలంగాణ తల్లిని మార్చడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నారు. కార్యక్రమాలలో బీఆర్‌ఎస్‌ నాయకులు భాస్కర్‌యాదవ్‌, దయానంద్‌యాదవ్‌, సుదర్శన్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, బాబుయాదవ్‌, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు



సాక్షి,సిటీబ్యూరో: గత 15 ఏళ్లుగా తక్కువ వేతనాలతో సేవలు అందిస్తున్నా.. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ.. మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా సిబ్బంది మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా సిబ్బంది విధులకు గైహాజరయ్యారు. సమ్మె కార్యక్రమంలో భాగంగా మేడ్చల్‌ కలెక్టరేట్‌ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాశాఖ అధికారులకు, ఎంఈవోలకు సమ్మె నోటీసులు ఇచ్చిన సిబ్బంది మంగళవారం నుంచి విధులకు హాజరుకాలేదు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 2004 నుంచి పీజీ సీఆర్టీ, పీఈటీలు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. విద్యాశాఖలో జిల్లా స్థాయిలో ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు తదితరులు పని చేస్తున్నారు. మండల స్థాయిలో కంప్యూటర్‌ సహాయకులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలను అందించే భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు, రీసోర్సు పర్సన్లు, పాఠశాల స్థాయిలో ఆర్ట్‌, క్రాఫ్ట్‌, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ఏఎన్‌ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్‌ సహాయకులు, వంట పనివారు, వాచ్మెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు పనిచేస్తున్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్లటంతో విద్యాశాఖపై తీవ్ర ప్రభావం పడుతోంది.

డిమాండ్లు ఇవే..

సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, ఇప్పటివరకు పేస్కేల్‌ కల్పించాలని, ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షల జీవిత బీమా. రూ.10 లక్షల ఆరోగ్య బీమా అమలు చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ.25 లక్షలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వెయిటేజ్‌ ఇవ్వాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు...

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని సమగ్ర శిక్షా సిబ్బంది పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఒక్క సమస్య పరిష్కారం కాకపోవటంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్‌,ఉపాధ్యక్షురాలు దేదీప్య తదితరులు పాల్గొన్నారు.